**శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi**
అక్టోబర్ 2021 | October 2021

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 87వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **అంతా ఒకే నేను** | రవి కృష్ణ శర్మ | 9 |
| **2.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 17 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 24 |
| 5. | Freedom from giving Advice | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Imprisoning God | D. Samarender Reddy | 41 |
| 7. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 41 |
| 8. | How I came into the fold of Sri Bhagawan | Smt. G. Naga Rajeswari | 46 |
| 9. | The Human dimension of Bhagavan Sri Ramana Maharshi | G. Sri Hari Rao | 49 |

## Events in Sri Ramana Kendram in October 2021

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 28th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(Devotees may please note that due to social distancing, *satsangs* are being held online. For details, please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# కోరిక మూలం

డా॥ కే.యస్. గారి 87వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

ప్రతి ఒక్కరం సుఖాన్ని కోరుకుంటాం. వీలైతే, ఎప్పటికీ అదే స్థితిలో వుండడానికి ఇష్టపడతాం. కొంత కాలం పాటు అలా సంతృప్తి కరంగా వుండడం సాధ్యమే. కాని ఒక ప్రక్క ఆ ఆనందం ఎప్పుడు అంతరిస్తుందో అన్న దిగులు వెంటాడడం మొదలు పెడుతుంది. ఆ భావన మొదలైన వెంటనే సుఖాన్ని అనుభవించడం సన్నగిల్లు తుంది. మనం నిజంగా ఆనందంగా వున్న కాలంలో సమయమూ, పరిసరాలూ మనకు గుర్తుండవు. ఉదాహరణకు మనకు బాగా ఇష్టమైన వాళ్ళతో వున్నామనుకోండి. వాళ్ళతో గంటపాటు లేదా ఇంకా ఎక్కువ కాలం గడిపినప్పటికీ, ఎంత త్వరగా గడిచిందని ఆశ్చర్యపోతాం. కాని కాలం గుర్తుకు వచ్చిన ఆ క్షణంలో మన ఆనందం కూడ తగ్గుతుంది. ప్రయత్నించినప్పటికీ మళ్ళీ పూర్వపు సుఖం అనుభవించడం కష్టమవుతుంది. ఎందుకంటే అలాంటి స్థితి తెలియకుండానే కలుగుతుంది. మన ఇష్టం ప్రకారం రావడం, పోవడం అంటూ వుండదు. దానికి కారణమూ మనకు తెలియదు.

## ఆహారం యొక్క అవసరం

గాఢ నిద్రలో వున్నప్పుడు చెప్పలేనంత ఆనందాన్ని అనుభవిస్తాం. మన పేరు, ప్రతిష్ఠలు గాని, సమయం, పరిసరాలు గాని సంపద, భార్య, సంతానం ఇవేవీ కూడ మన ఎఱుకలోకి

రావు. శరీర స్ఫురణ లేనప్పుడు ఒక అసాధారణ విషయమేమిటంటే, ప్రతి రోజు జరిగే సంఘటనలో, మన మనసు రంగంలో వుండదు. వీటి ధ్యాస లేకుండ పోతుంది. కాని ఆనందం అనుభవిస్తుంటాం. ప్రతి రోజూ సుమారు ఏడెనిమిది గంటల పాటు ఇది సంభవిస్తుంటుంది. ఎందుకు ఇలా జరుగుతుందని ఆశ్చర్యం వేస్తుంది. మెలకువగా వున్నప్పుడు మనకు ఆకలిదప్పులుంటాయి. ఏదో ఒకటి తినడం, త్రాగడం చేస్తుంటాం. నిద్రావస్థలో యివేవీ వుండవు. ఎప్పుడైనా ఏ అర్థరాత్రిలో మెలకువ వస్తే, నీళ్ళు త్రాగుతామేమో, అంతే. సాధువులు, ఋషులు చాలా తక్కువగా మాత్రమే భుజిస్తారు. డాక్టర్లు మనల్ని రోజులో మూడు, నాలుగు సార్లు ఆహారం తీసుకుంటూ వుండాలంటారు. కాని కొందరు ఆహారాన్ని తక్కువగా మాత్రమే గ్రహిస్తున్నప్పటికి, చురుకుగా వుంటారు.

రెండు సందర్భాలను గురించి చెప్పుకోవాలి. అవి అనుభవిస్తాము కాని ఇతరులకు వివరించలేము. మీరు చాలా బాధ, దుఃఖంలో వున్న సమయంలో ఆకలి అంటూ వుండదు. అలాగే మనకు ఇష్టమైన దగ్గరివారితో వున్నప్పుడు కూడ ఆకలి అనిపించదు. తినాల్సిన సమయం వచ్చినప్పటికీ, ఎదుటివారు గుర్తు చేసినా సరే, వారితో వుండడమే తినినంత హాయిగా వుంటుందని అంటాం. అమితమైన ప్రేమ, అమితమైన బాధ, దుఃఖము వున్న సందర్భాలలో ఆకలి, దప్పులకు తావుండదు. కాని శరీరానికి పోషణ అవసరం గనుక అలా అనిపించినప్పటికీ తినాల్సి వస్తుంది. కోరికలు

వున్నప్పుడు ఈ అవసరాలు జ్ఞప్తికి వస్తాయి. నిద్రావస్థలో వాటి జ్ఞాపకం, అవసరం వుండదు.

## ఆకలి, దప్పులు లేని స్థితి

అహం నాశనం జరిగినప్పుడు ఆకలి, లాంటివి వ్యక్తిని బాధించవు. భగవాన్ ఎన్నో ఏళ్ళ పాటు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఊళ్ళోకి భిక్షాటనకు వెళ్ళి, మూడుసార్లు దోసిలిలో పట్టినంత మాత్రం ఆహారాన్ని తీసుకుని జీవించేవారు. నిజానికి, తన 17వ సం॥ తరువాత బయటికి వచ్చినప్పుడు ఆహారమే అసలు తీసుకోకుండ వున్నారు. జీవితంలో ఆ వయసులో కోరికలు, ఎక్కువగా వుండడం, అధికంగా ఆహారాన్ని తీసుకొనడం జరుగుతుంది. కాని భగవాన్ తమ పరిసరాలనే మరచి వుండేవారు. ఆ పరిస్థితిలో పాతాళలింగం గర్భగుడిలో ఆయనను శ్రీ శేషాద్రి స్వామి, మరొక భక్తుడు చూడడం తటస్థించింది. మహర్షి ఆ రోజుల గురించి మాట్లాడేవారు కాదు, ఎందుకంటే అప్పటి పరిస్థితులను గురించి ఆయనకు ఏమీ తెలియదు. బయటకు తీసుకురాబడిన తరువాత కూడ, ఆయన నోటిలో కార్తికేయ అభిషేక తీర్థాలు, పాలు, పెరుగు, పసుపు మొదలైన ద్రవాలు స్మారకం లేని స్థితిలో పోయబడేవి. మ్రింగినంత మ్రింగేవారేమో.

అలాంటి జీవితాల నుండి మనం ఏమి గ్రహించగలం? ఏ కోరికా, ఏ సంకల్పం వుండరాదు. అలాంటివారికి మనలాంటి వాళ్ళు గ్రహించే ఆహారం యొక్క అవసరం వుండదు. కాని యథార్థంగా తమకు అవసరం లేనప్పటికీ, భగవాన్ మనకోసం తాము మూడు

పూటల ఆహారాన్ని తీసుకుంటూ వచ్చారు. ఆశ్రమము ఏర్పాటు చేయబడిన తరువాతి రోజుల్లో కూడ, ఏకాదశి, శివరాత్రి అంటూ తేడాలు లేకుండ, ఆ రోజు వచ్చిన భక్తులు నిరాశ చెందకూడదన్న ఉద్దేశంతో, వాళ్ళతో బాటు తామూ భుజించేవారు. ఒక జ్ఞానితోటి సహపంక్తిలో భోజనం చేశామన్న తృప్తి భక్తులకు వుండేది. అందుకే జ్ఞాని యొక్క ప్రవర్తనను మనం ఊహించలేము. మొదటి రోజుల్లో అయిదు రూపాయలతో భిక్ష ఏర్పాటు చేయబడేది. అప్పుడున్న భక్తులందరికి ప్రసాదం ఇవ్వబడేది. మరొక విషయమేమిటంటే భిక్ష ఇచ్చిన వారు భగవాన్‌ను తమతో బాటు గిరి ప్రదక్షిణం చేయమని కోరేవారు. ఆశ్రమ కట్టుబాటు ననుసరించి భగవాన్ వారితో గిరిప్రదక్షిణ చేసేవారు. ఒక్కొక్కసారి రాత్రిళ్ళు ప్రదక్షిణం చేసినప్పటికి, మళ్ళీ ప్రొద్దుటే సోఫాలో కూర్చుని వుండేవారు. భక్తులకు ఇరవైనాలుగు గంటలూ అందుబాటులో వుండే మహర్షికి మధ్యాహ్నం కునుకుతీసే అలవాటు వుండేది కాదు. కొన్ని సందర్భాలలో భిక్ష ఏర్పాటు జరిగినప్పుడు వరుసగా మూడు రోజులు గిరిప్రదక్షిణ చేసేవారు. భగవాన్ సౌలభ్యత అటువంటిది.

మహర్షి లాగ మనం ఒక గంటపాటు కూడ జీవించలేము. కొద్ది నిమిషాల పాటు కూడ ఆయనకు ఏకాంతం లభించేదికాదు. ఆశ్రమం హాలులో కూర్చొని వుండడం లేదా కొద్దిగా బయటికి వెళ్ళడం. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కొండమీదికి వెళ్ళేవారు. అలాంటి సమయాల్లో కూడ ఇతరులు ఆయనను వెంబడించి కొద్ది దూరంలో కూర్చుని లేదా నిలబడి వుండేవారు. ఎవరినీ ఆయన వెళ్ళిపొమ్మనే వారు కాదు. ఆయన శరీర స్పృహ బొత్తిగా లేనివారు.

గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రత్యేక శౌచ గృహాలు లేకుంటే మనం ఎంతో ఇబ్బంది పడతాం. ఒక రాత్రి భగవాన్ కాలకృత్యం కోసం కొండమీదికి వెళ్ళినప్పుడు దూరంగా వున్న భక్తులకు శబ్దాలు వినిపించాయి. భగవాన్ తిరిగివచ్చినప్పుడు ప్రశ్నిస్తే, ఒక కుక్క తమ శరీరాన్నంతటిని ఐదు నిమిషాల పాటు నాకుతూ వుండిందని, ఎంతో అదిలించిన తరువాతగాని వదలలేదని అన్నారు. దాని భావోద్రేకాన్ని అలా తీర్చుకుందని తాపీగా చెప్పారు. ఎన్నో సంవత్సరాల తరువాత మహర్షికి గోశాల దరిదాపుల్లో కాలకృత్యాలకు ఒక గదిని నిర్మించారు. అది ఇప్పటికీ వుంది.

## నిద్ర అవసరమా?

ఒక జ్ఞానిని అర్థం చేసుకోవడం చాలా కష్టం. మనం భగవాన్ అయితే తప్ప భగవాన్‌ను అవగాహన చేసుకోలేము. మహర్షి గురించి మనం ఏమైనా చెప్పడానికి ప్రయత్నిస్తే అది నిజమూ, అబద్ధమూ కూడా అవుతుంది. ఎందుకంటే అది అంధులు ఏనుగును వర్ణించిన రీతిలో వుంటుంది. మన అనుభవాన్ని బట్టి మనం వర్ణిస్తాం. ఎవరో ఒక సందర్భంలో భగవాన్‌ను ''మీరు నిద్ర కూడ పోకుండ అంత స్థిమితంగా, కలత లేకుండ ఎలా వుండగలరు?'' అని అడిగారు. ''మనసు అన్నది లేనప్పుడు, మీరు అనుభవించే వంటి నిద్ర వుండదు. నేను కొన్ని సెకండ్లపాటు కళ్ళు మూసుకుంటాను. అది చాలు'' అని భగవాన్ జవాబిచ్చారు. మనం అనుభవించలేదు గనుక మనకు అది అర్థం కాదు. కాని ఒకటి ఊహించవచ్చు. మనసన్నది పూర్తిగా నశించినప్పుడు శరీరం ఎల్లప్పుడూ తాజాగా వుంటుంది.

అప్పుడు శరీరపరమైన విశ్రాంతి అవసరం వుండదు. మధ్యాహ్న సమయాల్లో అలసట అనిపించినప్పుడు, కూర్చునే, ఒక అయిదు నిమిషాల పాటు కునుకు తీస్తాము. కాని మనసు హృదయంలో లీనమైన కారణంగా, మనం లేచినప్పుడు సేదదీరి, తాజాగా వుంటాం. ఎంతసేపు నిద్రపోయాము అన్నది ముఖ్యం కాదు, ఎంత తీవ్రతతో మనసు ఆత్మలో లీనమైనదన్నదే ముఖ్యం.

జ్ఞాని 'వ్యక్తి'త్వ చాయలు కూడ లేకుండ, అహం అసలు లేని దయాపూర్ణుడు. మనలో లాగ, మనసు లేనందువల్ల మన మాదిరి కోరికలుండవు. కోరికలు లేనప్పుడు, ఇతర అవసరాలుండవు. అందుకే జ్ఞాని ఎల్లప్పుడూ మెలకువగానే వుంటాడంటారు. చాలాకాలం పాటు, భగవాన్‌కు పరిచారకునిగా వుండిన కుంజుస్వామి ''భగవాన్ సోఫా మీద పూర్తిగా శరీరాన్ని జాపి పడుకోవడం నేనెప్పుడూ చూడలేదు. నిద్రపోతున్నప్పుడు గడ్డం మీద చేయి వుంచుకుని పడుకునేవారు. వెల్లకిల పడుకొనడం నేనెప్పుడూ చూడలేదు'' అనేవారు. అలాగే, ''నాకెప్పుడు మెలకువ వచ్చినా ఆయన చిరునవ్వుతో నన్ను చూస్తుండేవారు. భగవాన్ మన మాదిరి నిద్రించడం నేనెప్పుడూ చూడలేదు అని కూడ అన్నారు. ఆ విషయాన్ని గురించి ప్రశ్నించినప్పుడు ఎప్పుడో తప్ప ఏ జవాబూ ఇచ్చేవారు కాదు. మాట్లాడడం కూడా కోరిక యొక్క ఫలితమే. అదే లేనప్పుడు ఇక ఏ అవసరమూ వుండదు.

# అంతా ఒకే నేను & శ్రవణ మననాదులు

రవి కృష్ణ శర్మ

ఉన్నది 'ఒకే నేను' ఐతే అది మనం యెందుకు తెలుసుకోలేక పోతున్నాం? అంటే దానికి కారణం మనలో వున్న వాసనలే. ఈ వాసనలన్నీ సంపూర్ణంగా సమసిపోతే కానీ వున్నదంతా 'ఒకే నేను' అనే సత్యం మన యెరుకలోకి రాదు. ఆ వున్నది 'ఒకే నేను' అనేది యెరుకలోకి వచ్చేవరకు శ్రవణ మననాదులు జరుగుతూనే వుండాలి. ఈ విషయంలో భగవాన్ ఏయే సందర్భాలలో యేమి తెలియ చేసారో గమనిద్దాం.

ఒకసారి భగవాన్‌ను దర్శించుకోవటానికి కుంభకోణం నుండి ఇద్దరు పండితులు వచ్చారు. దర్శనానంతరం భగవాన్ వద్ద సెలవు పుచ్చుకొంటూ "స్వామీ, మనస్సు శాంతిలో అణుగునట్లు అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నాం" అని అన్నారు. భగవాన్ సెలవు చిహ్నంగా తల ఊపి, వారటు పోగానే సమీపంలో వున్న రామచంద్రయ్యరు గారిని చూసి "శాంతియే స్వరూపం. పైన వచ్చేదంతా తోసివేస్తే వుండేది శాంతే. ఇక అణిగేందుకేమున్నది? పక్వ చిత్తులకైతే శాంతియే స్వరూపం అంటే చాలు, జ్ఞానం కలుగుతుంది. అపక్వచిత్తులకే శ్రవణ మననాదులు చెప్పారు కాని, పక్వచిత్తులకు పనిలేదు" అని అన్నారు భగవాన్.

దగ్గరలో వున్న ఒకరు దీనిని విని "శ్రవణ మననాదులంటే వేదాంత గురువాక్య శ్రవణాదులేనా?" అని అడిగారు. "అవును.

ఐతే ఒకటి. ఈ బాహ్య శ్రవణ మననాదులేకాక అంతర శ్రవణ మననాదులు వున్నాయి. అవి మనః పరిపాక వశంగా స్ఫురించాలి. ఆ అంతర శ్రవణం చేసేవారికి ఎటువంటి సందేహాలుండవు'' అన్నారు భగవాన్. ''అంతర శ్రవణ మననాదులంటే యేమి?'' అని ప్రశ్నించిన వారితో ''సదా హృదయ కుహరమందు అహమహమని భాసించే ఆత్మస్ఫురణ నెరుగుటే అంతర శ్రవణమనీ, దానియందు నిలకడ నలవర్చుకొనుట మననమనీ, అది తానుగా నిలుచుట నిదిధ్యాసనమనీ'' భగవాన్ తెలియచేసారు.

మరి అంతా వున్నది 'ఒకే నేను' అనేది యెలా తెలుసుకోవాలి? ఈ విషయంలో ఒకసారి భగవాన్ దగ్గరికి ఒక సాధువు వచ్చి ''స్వామీ ఆత్మ అంతటా వున్నదంటారే? చచ్చిన శవంలో కూడా ఉంటుందా?'' అని ప్రశ్నించారు. దానికి భగవాన్ ''ఓహో! అదా కావలసింది. ఈ ప్రశ్న చచ్చిన శరీరానికి వచ్చిందా? మీకు వచ్చిందా?'' అని అడిగారు. ''నాకే'' అన్నారు ఆ సాధువు.

''సుషుప్తిలో నేనున్నానా? లేదా? అన్న సందేహం మీకు వస్తుందా? లేచిన తరువాత కదా నేనున్నానంటారు? అదే విధంగా శవంలో ఆత్మ ఉండనే వుంటుంది. యథార్థం విచారిస్తే చచ్చిన శరీరం లేదు, బ్రతికిన శరీరం లేదు. చలనం లేని శరీరం చచ్చిందంటాము చలనంతో వున్నది బ్రతికినదంటాం, అంతే. స్వప్నంలో చచ్చిన శరీరాలు, బ్రతికిన శరీరాలు యెన్నెన్నో చూస్తూ వుంటాం. మేల్కొన్న తరువాత అవన్నీ లేనివే. అదే విధంగా ఈ

చరాచర ప్రపంచం లేనేలేదు. చావంటే అహంవృత్తి ఉపశమించటమే. తిరిగి పుట్టడం అంటే అహంవృత్తి పుట్టటమే. ఇవే జనన మరణాలు. ఈ జనన మరణాలు అహంకారానికే కానీ మీకేమీ లేవు. ఈ అహం వృత్తి వున్నప్పుడూ మీరున్నారు, లేనప్పుడూ మీరున్నారు. వృత్తికి మూలం మీరు కానీ, వృత్తి మీరు కాదు కదా. ముక్తి అంటే పైన చెప్పిన చావు పుట్టుకల మూలం తెలుసుకొని ఆ అహం వృత్తిని సమూలంగా నాశనం చేయాలి. అదే ముక్తి. అంటే తెలివితో చావాలన్న మాట. అలా చస్తే 'అహమహ' మనే స్ఫురణగా అక్కడే పుడతారు. ఆ పుట్టుక కన్న వారికి యే సందేహాలు వుండవు'' అని సెలవిచ్చారు భగవాన్.

ఒకసారి ఐరోపా దేశం నుండి వచ్చిన ఒక యువకుడు వూరికి వెళ్ళే నిమిత్తం మూటా, ముల్లె కట్టిపెట్టి, వేద పారాయణ తరువాత భగవాన్ను ఎన్నో విధాల ప్రశ్నించాడు. భగవాన్ యథా ప్రకారం ''నీ వెవరవు? ఈ ప్రశ్నించే దెవరు?'' అనే ప్రశ్నలతో జవాబిచ్చారు. అయినా విడవకుండా ఆ యువకుడు భగవాన్ను ''గీతలో మీకు యే శ్లోకం ప్రియం?'' అని అడిగితే ''అన్నీ ప్రియమే'' అన్నారు భగవాన్. ''అందులో ముఖ్యమైనది ఏదీ?'' అని విడవకుండా అడిగాడు. భగవాన్ కొంచెం నిదానించి ''అహమాత్మా గుడాకేశ'' (అ-10-శ్లో-20) అన్న శ్లోకం సూచించారు. ఆ యువకుడు ఎంతో ఆనందించి సెలవు పుచ్చుకొంటూ, ''స్వామీ! ఈ అసత్యమైన నేను వున్నదే, ఇది కార్యాంతరాల వల్ల ప్రయాణం చేయవలసి వున్నది.

తాము అనుగ్రహించి, ఈ అసత్యమైన నేను, ఆ సత్యమైన నేనులో ఐక్యమయ్యేట్లు సిఫార్సు చేయాలని ప్రార్థన'' అన్నాడు. భగవాన్ చిరునవ్వుతో ''ఇన్ని నేనులు వుంటేకదా సిఫార్సుకు. అంతా ఒక్కటే నేను. సిఫార్సు చేసేందుకు చెప్పమనే నేనొకటి, చెప్పే నేనొకటి, వినే నేనొకటి వుండాలి. ఇన్ని నేనులు లేవే? అంతా ఒకే నేనుగా ఉన్నదే, చెప్పెదెవరితో? వినేదెవరు?'' అన్నారు.

ఎప్పుడైతే మన చిత్తం శాంతమవుతుందో అప్పుడు మాత్రమే ఉన్నది 'ఒకే నేను' అనేది మనకు యెరుకలోకి వస్తుంది. దీనిని గురించే, భగవాన్ వద్దకు వచ్చిన ఒక భక్తుడు చిన్న చీటీలో యేదో వ్రాసి భగవాన్‌కు అందచేసాడు. భగవాన్ అది చూసి సమీపస్థులతో ''ఇదిగో చూడండి, 'చిత్త శాంతియే మోక్షం కదా' అని వ్రాశారిందులో! ప్రశ్నలోనే జవాబు ఉన్నదే. చెప్పేటందుకు వేరే యేమున్నది. చిత్త మంటే యేమో తెలుసును కదా మీకు? అన్నారు భగవాన్. దానికి 'మనస్సు' అన్నాడా పృచ్ఛకుడు. ''ఆ మరింకేమి? ఆ మనస్సుకు శాంతి లభించటమే మోక్షమని మీ ప్రశ్నలోనే సమాధానం వున్నదే?'' అన్నారు భగవాన్. ''ఆ మనస్సు ఒక్కొక్కప్పుడు చంచలంగా వుంటుందే. ఆ చాంచల్యం రాకుండా పోయేదేలా'' అన్నాడా యువకుడు. ''ఎవరి చిత్తానికి చాంచల్యం? ఈ అడిగేదెవరు?'' అన్నారు భగవాన్. నా చిత్తానికే, నేనే అడిగేది'' అన్నాడతడు.

''ఆ - అదీ సమాచారం. నేననేవాడు ఒకడు వున్నాడు కదా? అప్పుడప్పుడు శాంతిని నీవు అనుభవిస్తూ వుండటం వల్ల శాంతి

అనేది వున్నదేనని ఒప్పుకోక తప్పదు. కోరికలే మనస్సు. ఆ కోరికలు లేకుండా చేసుకొంటే చాంచల్యం లేకుండా పోతుంది. చాంచల్యం లేకుంటే శాంతియే కదా వుండేది. ఉన్నదాన్ని పొందటానికి ప్రయత్నం అనవసరం. కోరికలు లేకుండా చేసుకొనేందుకే ప్రయత్నం. ఎప్పుడెప్పుడు మనస్సుకు చాంచల్యం కలుగుతుందో అప్పుడప్పుడు ఆయా విషయాల నుంచి మనసును మరల్చు కోవాలి. ఆ విధంగా చేసుకొంటే శాంతి తానుగా వుంటుంది. అదే ఆత్మ, అదే మోక్షం, అదే తాను'' అని సెలవిచ్చారు భగవాన్.

దీనిని గురించే భగవద్గీతలో అర్జునుడు శ్రీకృష్ణుని ఇలా ప్రశ్నిస్తాడు.

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవదృఢం
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరం
(అ6-శ్లో-34)

''కృష్ణా నీవు చెప్పినది చాలా బాగున్నది. కానీ మనస్సు మిక్కిలి చంచలమైనది. దృఢమైనది. మిక్కిలి బలీయమైనది. కనుక, ఈ మనస్సును నిగ్రహించటం గాలిని ఆపటం కంటే దుష్కరమైనది కదా? అని ప్రశ్నిస్తే శ్రీకృష్ణుడు ఇలా సమాధానమిస్తాడు.

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్
అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే (అ6-శ్లో-36)

నీవు చెప్పినది సత్యం అర్జునా, నిస్సందేహంగా మనస్సు

చంచలమైనది. దానిని వశపరచుకొనుట మిక్కిలి కష్టము. కానీ, అభ్యాస వైరాగ్యముల ద్వారా దానిని వశపరచుకొనుట సాధ్యమే అని అంటాడు. అది యెలా అంటే

శనైః శనైరుపరమేత్ బుధ్యా ధృతిగృహీతయా
ఆత్మసంస్థితం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్
(అ6-శ్లో-25)

ఎప్పుడెప్పుడైతే మనస్సు బాహ్య ప్రపంచంలో తిరుగుతూ వుంటుందో అప్పుడప్పుడు క్రమక్రమంగా సాధన చేయుచూ ఉపరతిని పొంది, ధైర్యంతో బుద్ధిబలంతో మనస్సును పరమాత్మ యందు స్థిరమొనర్చి, పరమాత్మను తప్ప మరి యే ఇతర విషయాలను చింతింపకుండా ఉండేలా సాధన చేయాలి అని. అలానే

యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరం
తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ (అ6-శ్లో-26)

సహజంగా నిలకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయాల యందు విశ్రుంఖలంగా పరిభ్రమించుచుండును. అట్టి మనస్సును ఆయా విషయముల నుండి పదే పదే మరల్చి, దానిని పరమాత్మ యందే స్థిరంగా నిలుపవలెను అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో తెలియచేసాడు.

- భగవాన్ కూడా ఇదే తెలియచేస్తూ వున్నారు. ఎలాగైతే అచ్చోసిన ఆబోతు వివిధ ప్రాంతాలలో గడ్డి మేయటానికి అలవాటు పడిందో,

అలా మన మనస్సు కూడా యింతకాలం బాహ్య ప్రపంచంలో తిరగటానికి అలవాటు పడింది. ఆబోతును బలవంతంగా గోశాలలోకి తీసుకొని రాలేము. దాన్ని తీసుకొని రావాలంటే పచ్చ గడ్డి చూపించాలి. అది చూపించి నెమ్మది నెమ్మదిగా తీసుకొని వచ్చినట్లే బాహ్య ప్రపంచంలో తిరుగుతున్న మన మనస్సును కూడా సాధన ద్వారా హృదయంలో సంస్థితమై ఉండేలా చేయాలి. ఇప్పటి కిప్పుడు చిత్తం శాంతిని పొందాలి, మోక్షం కలగాలి అంటే అది అయ్యే పని కాదు. ఇంతకాలం ఈ శరీరమే నేను అనే భ్రమతో పంచేంద్రియాలతో, సత్వరజస్తమో గుణాలతో కూడి బయట సంచరిస్తూ వుండటం వలన అసలైన 'నేను' అనేది తెలుసుకోవటం అంత తేలిక కాదు.

దీన్ని గురించే భగవద్గీతలో 7వ అధ్యాయంలో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

యే చైవ సాత్వికా భావా రాజసాస్తామసాశ్చయే

మత్త ఏవేతి తాన్ విద్ధి న త్వహం తేషు తే మయి (అ7-శ్లో-12)

నాలో ఈ సాత్విక, రాజసిక, తామసిక భావాలు వున్నాయి. కానీ నేను ఇవేవి కాను. ఈ మూడు భావాలు నాలో వస్తూ, పోతూ వున్నాయి. అవేవి నేను కాదు. నేను త్రిగుణాతీతుడను అనేది దృఢ మవ్వాలి. అది దృఢ మవ్వాలి అంటే అభ్యాస వైరాగ్యాలు కావాలి. ఎప్పుడైతే అభ్యాస వైరాగ్యాలు తీవ్రమౌతాయో అప్పుడు మాత్రమే చిత్తానికి శాంతి కలుగుతుంది. ఆ చిత్తం శాంతమైనప్పుడు వున్నది

ఒకే నేను అనేది గుర్తించ గలుగుతాము.

భగవాన్ తెలియచేస్తున్నది కూడా అదే. ఏది నీలో జరుగుతున్నా అది నీవు కాదు. నీ మనస్సు కదులుతూ ఉండవచ్చు. కానీ నీవు మనస్సువు కాదు, బుద్ధివి కాదు, అహంకారానివి కాదు అని. కానీ మనం మనస్సు, బుద్ధి మరియు అహంకారంతో తాదాత్మ్యత చెందుతున్నాం కాబట్టి ఈ సమస్య వస్తున్నది. అది రాకుండా ఉండాలంటే మనం మన చిత్తానికి ఎటువంటి ఆహారాన్ని ఇస్తున్నామో గమనించాలి. ఆ ఆహారాన్ని క్రమక్రమంగా తగ్గించుకొంటూ పోతూ ఉంటే అప్పుడు, బాహ్య ప్రపంచంతో తాదాత్మ్యత చెందటం మాని అంతరంగంలో వున్న ఆత్మ (నేను) మాత్రమే సత్యమని యెరుక కలుగుతుంది. దాని కోసం శ్రవణ మననాదులు మరల మరల చేస్తూ వుండాలి. ఇలా జరుగుతూ ఉంటే ఒకానొక రోజుకి చిత్తం శుద్ధమౌతుంది. ఆ శుద్ధమైన మనస్సు శాంతిని పొందుతుంది. అలా శాంతి పొందిన మనస్సుకి యే కోరికలూ వుండవు. ఏ ప్రశ్నలూ వుదయించవు. అలా దేనితో తాదాత్మ్యత చెందకుండా, వున్నది 'నేను' మాత్రమే అనే స్ఫురణతో నిలకడ చెంది వుంటాడో అప్పుడు భగవాన్ చెప్పిన హృదయకుహర మధ్యే కేవలం బ్రహ్మ మాత్రం హ్యహమహ మితి సాక్షాద్ ఆత్మ రూపేణ భాతి' అనేది చాలా స్పష్టంగా అర్థమౌతుంది. వున్న నేను ఒక్కటే. ఈ కనపడేదంతా కనిపిస్తున్నదే కానీ సత్యం కాదు అనేది స్పష్టమౌతుంది.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

ఈ సందర్భంలో ఇంకొక విషయం కూడా చెప్పాల్సిన అవసరం వుంది. శ్రీ భగవాన్ గురించి గానీ, వారి రచనల గురించి గానీ ఎక్కువగా తెలియని వారు, వారిని ఎటువంటి హృదయ స్పందనలు లేని వ్యక్తిగానూ కేవలం ఒక తార్కికుని గానూ, ఉద్వేగా లేమీ లేని జడస్వరూపుడైన జ్ఞానిగానూ భావించే అవకాశము లేకపోలేదు. భగవత్ స్పర్శ వల్ల లేదా భగవన్నామముగానీ వినగానే పులకించి కరిగిపోయే భక్తాగ్రేసరులకూ శ్రీ భగవాన్‌కు చాలా దూరమనే భావము కలగడం కద్దు. కానీ శ్రీ భగవాన్‌తో సన్నిహితంగా మెలిగిన వారికీ, వారి రచనలను నిశితంగా పఠించిన వారికీ స్పష్టంగా విశదమయ్యే విషయం యేమిటంటే శ్రీ భగవాన్ ఎంత మహాజ్ఞానియో అంత మహాభక్తులు కూడా. నిజమయిన భక్తులే నిజయమయిన జ్ఞానులు కాగలుగుతారనీ, జ్ఞానులే నిజమైన భక్తులనీ శ్రీ భగవాన్ అనేక పర్యాయములు మాతో చెప్పారు. జ్ఞానమార్గములోగాని, భక్తి మార్గములో గాని చేరుకోవలసిన గమ్యము అహంకారము సమూలంగా నిర్మూలింప బడటమే. ఈ విషయం గురించి వేరు చర్చకు తావు లేదు. ఈ సందర్భంలో నేను ప్రస్తావించదలుచుకున్న విషయం ఒక్కటే; ఎన్నో సందర్భాలలో భక్త్యావేశంతో పాటలు వారి సన్నిధిలో పాడినప్పుడు కానీ,

చదవబడినప్పుడుకానీ, లేదా వారే మహాభక్తులూ, మహాత్ములూ వ్రాసిన పుస్తకాలు చదువుతున్నప్పుడు కానీ, ఉద్వేగ భరితమయిన సన్నివేశము వచ్చినప్పుడు వారి కంఠము గద్గదమై, కన్నులు నీటితో నిండి, ఇక చదవలేక పుస్తకం పక్కన పెట్టేసేవారు. అలాంటి సందర్భము ఒకటి ఉదహరించాలంటే, శ్రీ సుందర మూర్తి నాయనార్ జీవితంలోని కొన్ని సన్నివేశాలు 'తిరుచ్చుళి మహాత్మ్యం (స్థల పురాణం) నుండి శ్రీ భగవాన్ వివరిస్తున్నప్పుడు చూడవలసి నదే! అలాగే తాయుమానువర్ రచనలో 24వ శ్లోకం బహు ఉత్కృష్ట మయినది.

"భూమ్యాకాశాలు నీవే అని తెలుసుకొని, నా మనోఫలకంలో మీ చిత్రపటం పలుసార్లు చూసుకుంటూ 'నా ప్రియతమ దైవమా! నన్ను కరుణించి నా చెంతకు వచ్చి నన్నాలింగనము చేసుకోవా? నన్ను నీ వాడిని చేసుకోవా?" అని ఆక్రోశించినపుడు నా హృదయం బాధతో నిండి పోయి, అశ్రువులు ధారాపాతంగా స్రవిస్తున్నప్పుడు నేను తాదాత్మ్యంతో శిలా ప్రతిమనై పోతాను".

శ్రీ భగవాన్ కళ్ళు అశ్రువులతో నిండి పోయాయి. కంఠము ఉద్వేగముతో పూడుకుపోయి మాటలు రాలేదు. పుస్తకమును పక్కన పెట్టి, ప్రవచనము మానివేయవలసి వచ్చినది. ఈ విషయం ముగించేముందు ఒక్క మాట చెప్పాలి. శ్రీ భగవాన్ భక్త్యావేశానికి కేవలం పాటలే కారణాలు కాదు. ఎటువంటి మహత్తరమైన సంఘటన ఐనా - అది దాతృత్వానికి సంబంధించినది కావచ్చు; దయాగుణానికి సంబంధించినది కావచ్చు, వైభవానికి

సంబంధించినది కావచ్చు; ఉదాత్త గుణానికి సంబంధించినది కావచ్చు - శ్రీ భగవాన్‌ను కదిలించి వేసేది. ఒక ఉదాహరణ ప్రస్తావిస్తాను: ఒకసారి శ్రీ భగవాన్ తమిళ రామాయణ గ్రంథకర్త శ్రీ కంబర్ జీవిత విశేషాలు వివరిస్తున్నారు. ఏదో బేధాభిప్రాయ కారణంగా వారు (కంబర్) చోళరాజు ఆస్థానం విడిచి వెళ్ళి పోయారు. వెళ్ళే ముందు, అక్కసుతో “నీ ఒక్కడివే రాజువి, నీదొక్కడిదే రాజ్యమూ అనుకుంటున్నావేమో! కవులు తమ జీవనోపాధి కోసము నీకు ఊడిగం చేయాలనుకుంటున్నావేమో! చూస్తూ వుండు నీ సహాయం నాకేమీ అఖ్ఖరలేదు. నా సంగతి నేను చూసుకోగలను. నీకు ధీటైన రాజును నాకు బంటుగా నియమించుకుంటాను”, అని సవాలు విసిరి వెళ్ళిపోయారు.

ఆయన తరువాత పాండ్యరాజు ప్రాపు సంపాదించుకొని ఆయన ఆస్థాన కవిగా స్థానం సంపాదించుకోవడమే కాక ఆయనకు బహు సన్నిహితుడైన స్నేహితుడయ్యారు. కొంతకాలం తరువాత, పాండ్యాధీశుడు బహుకరించిన వైభవాలతో, మందీ మార్బలంతో, తన ఐశ్వర్యాన్ని చాటు కోవడానికన్నట్లు తనను నిర్లక్ష్యం చేసిన చోళరాజు ఆస్థానానికి వెళ్ళారు. మారు వేషంలో ఆయన బంటుగా పాండ్య రాజ్యాధీశుడు కూడా వెళ్ళారు. ఇతర సేవలతో బాటు, ఆ ‘బంటు’ కంబర్‌కు తమలపాకులు చుట్టి ఇవ్వడం కూడా ఒక బాధ్యత. చోళరాజుకు తను విసిరిన సవాలు గురించి పాండ్య రాజుకు వివరించగా, ఆయన స్నేహధర్మంగా, కంబర్ ప్రతిజ్ఞ నిలబెట్టుకోవడం కోసం, రాజుగారు బంటుగా వెళ్ళడానికి

సమ్మతించారు. ఆ విధంగా చోళరాజు ఆస్థానంలో, కంబర్‌కు ఆ కుహనా బంటు తాంబూలం అందించారు. కంబర్ ఆ తాంబూలాన్ని తీసుకున్నారే గానీ నోట్లో పెట్టుకోలేదు. పాండ్య రాజ్యాధీశుడు తన ఉదాత్తత, స్నేహధర్మం ప్రదర్శించడానికి బంటు వేషంలో వచ్చారు. కానీ అలాంటి మహాత్ముని సేవలు తాను స్వీకరించడం సబబు కాదని కంబర్ భావించారు.

శ్రీ భగవాన్ ఈ వృత్తాంతము వివరిస్తున్నప్పుడు, పాండ్యరాజ్యాధీశుడు, కంబర్‌లు కనబరచిన ఉదాత్తతకు, ఔదార్యమునకు వారి కనులు చెమ్మగిల్లినవి. కంఠము రుద్ధము కాగా, ముందుకు సాగలేక, కొద్దిసేపు మౌనము వహించవలసి వచ్చినది. ఈ సన్నివేశము గాంచినప్పుడు నాకొక ఆంగ్ల వాక్యము గుర్తు వచ్చినది: ఉన్నతమైన మనస్సులు, ఖరీదైన లోహముల వలె తేలికగా కరిగి పోతవి. భక్తుల బాధలు విని శ్రీ భగవాన్ వారితో బాటు విలపించే వారు. శివపురాణంలో ఒక వాక్యమున్నది: భగవంతునికి సంతోషమూ, దుఃఖమూ రెండూ వుంటవి.

దీనికి గొప్ప ఉదాహరణ ఎచ్చమ్మాళ్ వృత్తాంతం. శ్రీ భగవాన్ విరూపాక్ష గుహలో వున్నప్పటి నుండీ ఎచ్చమ్మాళ్ ఆయన భక్తురాలు. చిన్నతనంలోనే ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. ఇద్దరు చిన్న పిల్లలు కూడా కాలం చేశారు. అప్పుడు ఆమె మొదటిసారిగా శ్రీ భగవాన్ దగ్గరకు వచ్చింది. శ్రీ భగవాన్ సన్నిధిలో ఆమెకు స్వాంతన లభించింది. శ్రీ భగవాన్ తోటిదే లోకమని భావించి కాలం గడుపుతూ వచ్చింది. తన బాధ మరిచిపోదామనే వుద్దేశంతో తన సోదరుని కుమార్తె చెల్లమ్మాళ్‌ను పెంచి పెద్దచేసింది. ఆమె కూడా

ఒక మగ శిశువుకు జన్మనిచ్చి దివంగతురాలయినది. దుఃఖముతో వివశురాలై, ఆ పసిబిడ్డను తీసుకువచ్చి శ్రీ భగవాన్ పాదాల వద్ద వుంచి భోరుమని ఏడ్చింది. భగవాన్ ఆమెతో పాటు ఏడ్చారట. ఇది జరిగినప్పుడు నేనక్కడ లేను కానీ, అలా జరిగిందని నాకు తెలుసు.

శాస్త్రోక్తంగా, రాగతాళ యుక్తంగా పాడటం నాకు రాదు. అందు వల్ల నేను పాడుతూ వుండే వాడిని అనుట కంటే, పఠిస్తూ వుండే వాడిని అనుట సరియైనది. శ్రీ భగవాన్ పట్ల నా పూజావిధానమదే! తమిళంలో భక్తిపరమయిన సాహిత్యం గురించి నా పరిజ్ఞానం పరిమితమైనదే అయినా, నాకున్న భావాలనే వ్యక్తపరిచే ఆణిముత్యాల వంటి భక్తిగీతాలను తేలికగా ఎంచుకొనే వాడిని. మహాత్ములూ ఋషులూ భక్తాగ్రేసరులయిన, మాణిక్య వాచకర్, తాయుమానువర్, రామలింగస్వామి, అరుణగిరి నాథర్, పట్టినాథర్ వంటి వారల పాటలు పాడుతూ నా హృదయ వేదనను శ్రీ భగవాన్ సన్నిధిలో వ్యక్తపరుచుకునే వాడిని. ఇతరులు ధ్యానము, యోగము, జపము వంటి సాధనల వల్ల పొందు లాభము నేనీ పాటల వల్ల పొందేవాడిని. శ్రీ భగవత్ సాన్నిధ్యానికి నేనిదొక బాటగా ఎంచు కున్నాను. ఇది మాత్రము కేవలం శ్రీ భగవాన్ సంకల్ప ఫలితమే సుమా!

తొలి రోజులలో, ఈ నా సాధనకు శ్రీ భగవాన్ సమ్మతి వున్నట్లు అందరకూ, స్పష్టముగా తెలిసేది. తరువాతి రోజులలో అంత బాహాటముగా ప్రస్ఫుటమయ్యేది కాదు. ఇతర సోదర భక్తులకు కూడా యిలాంటి అనుభవమే కలిగేది. మొదట్లో శ్రీ భగవాన్ కరుణ,

వారి పట్ల ఆయన ప్రదర్శించు ఉత్సుకత కాలక్రమేణా తగ్గుతూ వచ్చేది. ఈ క్రమంలోనే శ్రీ భగవాన్ పట్ల భక్తుల బంధం గట్టి పడుతూ వుండేది. నేను పాడేపాటలలో వున్న ఆక్రందనలు శ్రీ భగవాన్ నా వైపు ప్రత్యేకముగా చూపవలసిన కరుణా పూరితదృక్కులు అవసరము కూడా నాకు తగ్గినది. తరువాతి రోజులలో వారు నా పాటలు వింటున్నట్లు కూడా కనిపించే వారు కాదు. అయితే ఆయన ఏమైనా పుస్తకాలు గానీ ఉత్తరాలు గానీ చదువుకుంటున్నట్లు కనిపించినా వారి అంతఃకరణ నా పై వున్నట్లే నేను భావించేవాడిని. ఏక కాలంలో అనేకమంది భక్తులపై కరుణ ప్రసరింపగల శక్తి వారికుండేది. అలాగే ప్రసరింపజేసేవారు కూడా! ఏదైనా సందర్భములో, ఎవరైనా వచ్చి వారికి ఒక ఉత్తరమో, కాగితమో ఇచ్చినప్పుడు నేను పాట ఆపినట్లయితే, నన్ను కొన సాగించమని ఆదేశించేవారు.

ఆశ్రమంలో నాలుగేళ్ళకు పైగా వున్న తరువాత ప్రతిరోజూ, ఉదయం 10-11 గంటల మధ్య - శ్రీ భగవాన్ రెండవ టపాలు కూడా చూసి, మధ్యాహ్న భోజనానికి లేచే ముందు - ఒక అరగంట పాడటం అలవాటుగా చేసుకున్నాను.

ఇది సాధనా క్రమంగా మలుచుకోవడం వల్ల నాకు లాభం కలగడం శ్రీ భగవాన్ గుర్తించారు. అందువల్ల నన్నెవరూ ఆపకుండా వారు ఈ కార్యక్రమాన్ని కొనసాగనిచ్చారు. ఇక్కడ ఒక మాట చెప్పాలి. ఎప్పుడైన వేరొక భక్తుడు కానీ ఆశ్రమ సందర్శకులు గానీ హాలులో పాట పాడుతూ వుంటే, ఆఫీసు నుంచి ఆపమని తాఖీదు వచ్చేది. ఇలా ఆపడం శ్రీ భగవాన్‌కు చాలాసార్లు నచ్చేది కాదు.

కానీ వారు కలగచేసుకునేవారు కాదు. ఒకసారి మాత్రం వారు కలగచేసుకోవడం నేను చూశాను. నా స్నేహితుడు, ఒకాయన నాకు గుర్తున్నంతవరకూ ఆయన పేరు అరుల్ ప్రకాశమ్ - శ్రీ సుబ్రహ్మణ్య భారతి శ్రీ భగవతి శక్తి మీద రచించిన పాట ఒకటి ఎంతో భక్త్యావేశంతో పాడుతున్నారు.

ఆయన తాదాత్మ్యంతో పాడుతూ వుండగా, మధ్యలో ఆఫీసులో వారి ఆదేశాల మేరకు, శ్రీ భగవాన్ పరిచారకుడొకాయన వచ్చి, ఈయనను పాడటం ఆపి వేయమన్నారు. నా స్నేహితుడు పాడటమయితే ఆపివేశారు కానీ, చాలా అమర్యాదకరంగా వున్న ఆ ప్రవర్తనకు నొచ్చుకొని, ఎంతో బాధతో భోరుమని ఏడ్వసాగారు. శ్రీ భగవాన్ చలించిపోయారు. ఆ పరిచారకుణ్ణి మందలించి నా స్నేహితుణ్ణి పాట కొనసాగించమని ఆనతిచ్చారు.

నేను భావావేశంతో పాడుతున్నప్పుడు శ్రీ భగవాన్ ఎలా ప్రోత్సహించేవారో ఒక మాట చెప్పాలి. వారి ప్రకాశభరితమైన నయనాలతో నా వైపు చూస్తూ వుండేవారు. ఒక్కోసారి పాటలోని భావం వల్ల ఉద్వేగంతో నా కళ్ళు నీళ్ళతో నిండిపోయి, కొద్దిసేపు పాట ఆపవలసివచ్చేది. భక్తితో నిండిపోయినందువల్ల పొరలివచ్చు ఆ ఆనందాశ్రువులు ముక్తిదాయకములే అనేవారు శ్రీ భగవాన్. ఇలాంటి భక్త్యావేశముతో స్రవించు బాష్పములు మంచివని చెబుతూ, తిరువాచకములో చెప్పబడిన, "నీ గురించి (భగవంతుని గురించి) రోదించిన నిన్ను పొందగలము;" అను చరణము ఉదహరించెడివారు శ్రీ భగవాన్. (సశేషం)

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీమతి శాంతా రంగాచారి

**మల్లాది ఫణిమాల**

శ్రీమతి శాంతా రంగాచారి పాత్రికేయురాలు. ఈమె 1980-88 మధ్యలో మౌంటెన్‌పాత్‌కు సంపాదకవర్గంలో సభ్యురాలిగా కూడా వ్యవహరించారు. ఇలా, శ్రీరమణ భక్తులకు మరియు శ్రీ రమణాశ్రమానికి తమ సేవలందించారు. శ్రీమతి శాంతా రంగాచారి గారిని శ్రీ రమణులు ఏ విధంగా అనుగ్రహించి, కరుణించారో చూద్దాం!

## బాల్యంలో శ్రీరమణుల ప్రభావము

చిన్నతనంలో శ్రీమతి శాంతా రంగాచారి గారు శ్రీరమణులకు నేరుగా ఒక ఉత్తరం రాశారు. ఆ ఉత్తరంలో, ''స్వామీ! నాకు కోపం ఎక్కువ. తరచూ కోపం వస్తూనే వుంటుంది. ఈ సమస్యకు పరిష్కారాన్ని అర్థిస్తున్నాను. దయచేసి నా కోపాన్ని తగ్గించుకునే మార్గాన్ని అనుగ్రహించండి'' అంటూ శ్రీ భగవానులను ఆర్తితో వేడుకుంటూ రాసిన ఈ ఉత్తరానికి వారంలోగా శాంతా రంగాచారికి జవాబు వచ్చేసింది. సర్వాధికారి గారి సంతకంతో శ్రీరమణుల సందేశం ఒక ఉత్తరంలో ఈ విధంగా వ్రాయబడింది. ''నీవు నీ కోపాన్ని అణుచుకోవడానికి ఎల్లప్పుడూ కృషి కొనసాగిస్తే, అది దానంతట అదే తగ్గిపోతుంది. నీవు ఈ పనిని సునాయాసంగా చేయగలుగుతావు. నా ఆశీస్సులు నీకు ఎల్లప్పుడూ ఉన్నాయి'' అని శ్రీరమణులు జవాబు ఇచ్చారు.

చిన్నపిల్లగా కాకుండా ఒక ఎదిగిన మనిషిలా భావించి చక్కటి సలహాని అందించిన శ్రీరమణుల వైఖరి శాంతకు ఎంతో ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి. ఆమె ఇలా అనుకున్నారు. "సాధారణంగా చిన్న పిల్లలకు ఒక స్పోర్ట్స్ డే న తప్ప, మిగతా రోజుల్లో ఇది చేయి! అది చేయి! ఇలా చేయి! అలా చేయవద్దు! ఇలా, పలు రకాల సూచనలు, ఆదేశాలు, హెచ్చరికలు వస్తూనే ఉంటాయి కదా... మరి ఇప్పుడు ఈ సద్గురువు నాతో, నీ కోపం కదా! నీవే దాని సంగతి చూసుకోవాలి అని చెప్పారు. ఈ సమస్యని పరిష్కరించు కోవడాన్ని నాకే వదిలేశారు.ఎంతో మృదువుగా, సున్నితంగా నాలో ఒక చక్కటి ఆధ్యాత్మిక దృక్పథాన్ని మేల్కొల్పారే! అని శ్రీమతి శాంతా రంగాచారి గారు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఆమె నమ్మదగ్గ వారు చక్కటి సలహాని ఇవ్వగలవారు కుటుంబానికి చెందిన వారు ఎంతో అవసరమని భావించిన రోజులలో దివి నుంచి వూడిపడ్డట్టు శ్రీరమణులు శాంతా రంగాచారి గారికి లభించారు.

శాంతా రంగాచారి గారి తండ్రిగారు చాలా మొండివారు బొత్తిగా సహనం లేని వారు కూడా. అంతేకాక సంశయాత్ములు కావటం చేత ఎవరిని, దేనిని తేలికగా నమ్మేవారు కారు. అటువంటి వారు కూడా శ్రీరమణుల గొప్పతనం మరియు నిరాడంబరత గురించి ఏ విధమైన ప్రతికూల భావమూ లేకుండా చిన్నతనంలో శ్రీమతి శాంతా రంగాచారి గారికి తరచూ చెప్తూ ఉండేవారు.

## బాల్యంలో శ్రీ రమణాశ్రమ సందర్శనము

శాంతా రంగాచారి గారి సోదరి వీరి కుటుంబాన్నంతటిని తీర్థయాత్రకి తీసుకొని వెళుతూ, వారంతా కూడా శ్రీరమణాశ్రమంలో

రెండు రోజులకంటే ఉండడం వీలుపడదు అనే ఆలోచనలతో అరుణాచలం బయల్దేరారు. రెండు రోజుల కంటే ఉండటం సాధ్యపడదు అని అనుకున్నప్పటికీ వారం రోజులపాటు అక్కడే ఉండిపోయారు. శ్రీరమణాశ్రమంలో గడిపిన ఈ వారం రోజుల వ్యవధి శాంతా రంగాచారి జీవితాన్ని ఎంతగానో మార్చి వేసింది. అరుణాచలం వదలి, తిరిగి వెళ్ళవలసిన రోజు వచ్చినప్పుడు చెప్పలేని ఒక బాధ, ఏదో కోల్పోయిన భావన కలిగి, ఆమె ఏడ్చారు కూడా!

శ్రీరమణుల దర్శనం వారిని పూర్తిగా కదిల్చివేసింది. శ్రీరమణులు కూర్చున్న హాలుని సమీపించగానే శాంతా రంగాచారి గారి అమ్మగారు, అన్నా, అక్క, వెంటనే హాల్‌లోకి ప్రవేశించి కూర్చున్నారు. శాంత మాత్రం ఏదో తెలియని బెరుకుతో వెనక్కి ఉండిపోయారు. తన్ను తాను సంభాళించుకుని తలుపు దగ్గరకు చేరి లోపలికి తొంగి చూశారు. భగవంతుడు తన దివ్యకాంతితో శ్రీరమణాశ్రమం వచ్చి, శ్రీరమణుల రూపంలో దర్శనమిస్తున్నారా... అన్న భావన పన్నెండేళ్ళ శాంత మదిలో మెదిలింది. బంగారు వన్నె, మునుపెన్నడూ ఎక్కడ చూడని తేజోమయమైన వదనము, సోఫా మీద చేరగిలబడిన చక్కటి విగ్రహం -- శాంతకు కనిపించింది. ఆ స్థలానికి బలంగా అతుక్కుపోయి సమాధిలో ఉన్నవారి వలె అలాగే నిలబడి పోయింది, శాంత. అలా కొంత సేపు ధ్యానమగ్నులై, అటు పిమ్మట రమణుల వైపు నడిచి వెళ్లి వారి పాదాలను ఆమె స్పృశించారు. వెనకాల నుంచి 'శ్రీరమణులను తాకకూడదు. వారిని తాకడం నిషిద్ధం'' అని ఎవరో అన్న మాట వినిపించింది. ఆమె చేసిన పనికి ఎంతో నిరసనతో ఆమె వైపు కొంతమంది భక్తులు

చూపులు విసిరినప్పటికీ, వాళ్ళందరి మధ్య నుంచి నెమ్మదిగా నిష్క్రమించి కిటికీలో దగ్గరికి వెళ్లి శాంతా కూర్చున్నారు. కిటికీలో కూర్చున్న శాంతా రంగాచారికి కంటి వెంట కారుతున్న అశ్రుధారను ఆపడం అసాధ్యమైనది.

ఆ రోజంతా కన్నీళ్లు తుడుచుకోవడంతోనే సరిపోయింది. నిజానికి అవి దుఃఖాశ్రువులు కావు, ఆనందబాష్పాలూ కావు. మహర్షిలో లిప్తపాటుగా ఆమెకు దృగ్గోచరమైన దానిని, అంటే ఆ ఉన్నతమైనటువంటి ఆత్మ స్థితిని పొందాలి అనేటటువంటి కాంక్షతో, ఆర్తితో తనకు తెలియకుండానే కంటి వెంట ఆమె పడే తపన ప్రకటితమైనది. శ్రీరమణులు ఆమె వైపు దృష్టి సారించారు. వారి దృష్టి శాంత మీద పడగానే ఆమె కళ్ళ వెంట ఆనందామృత ధార ప్రవహింపసాగింది. 40 ఏళ్ల తర్వాత కూడా ఈ సంఘటనను తలచుకున్నప్పుడల్లా కళ్ళు చెమ్మగిల్లేవట!

## శ్రీరమణుల సన్నిధిలో నాదార్చన

ఆమె చుట్టూ ఎవరో ఉన్నారని తెలిసినా వాళ్ల గురించి శాంత పట్టించుకోలేదు. ఒక గంట సేపు మౌన స్థితిలో ఆమె ఉండి పోయింది. ఉన్నట్టుండి పన్నెండేళ్ల శాంతకు శ్రీరమణుల ఎదుట పాట పాడాలి అనిపించింది. ఎట్టి సంకోచమూ లేకుండా చక్కటి లేత గళాన్ని ఎత్తి, "నిన్నే కోరి యున్నాను రా!" అని తాళం వేస్తూ శ్రీ త్యాగరాజ స్వామి వారి కీర్తనను ఆమె ఆలపించింది. చిన్న పిల్లలకు ఉండే స్వేచ్ఛతో ఆ కీర్తన పూర్తి అవ్వగానే "తెలిసి రామ చింతనలో నామము సేయవే ఓ మనసా!" అని మరొక త్యాగరాజ స్వామి వారి కీర్తనను పాడింది.

''తలపులన్నీ నిలిపి నిమిషమైన తారక రూపుని నిజ తత్వార్థము ... తెలిసి రామ చింతనలో....'' అని శాంత అనుపల్లవి పాడుతున్నప్పుడు శ్రీరమణులు ఆమెవైపు తిరిగి తమ కృపా వీక్షణాన్ని ఆమెకు కృప చేశారు. వాత్సల్యమైన సద్గురుని కృపా వీక్షణలో ఓలలాడిన శాంతకు ఎప్పుడూ రమణుల పాదాల చెంతనే ఉండిపోవాలి అని అనిపించింది. వారం రోజుల పాటు పొద్దున్న సాయంత్రం హాలులో కిటికీ దగ్గర మౌనంగా, ఏ చీకూ చింతా లేకుండా శ్రీరమణుల వంకే చూస్తూ కూర్చోవడం శాంతకు అలవాటుగా మారింది.

అలా శ్రీరమణాశ్రమంలో ఆమె గడిపిన ప్రతి నిమిషము శ్రీరమణుల చైతన్యం నుంచి కలిగే ఆత్మానందాన్ని ఆమె, ఆమె చుట్టూ ఉన్నవారు -- అందరూ అనుభవించడాన్ని ఆమె గమనించింది. శ్రీరమణుల సన్నిధిలో భాష వ్యర్థమని వారి సన్నిధిలో ఉండటమే ఎంతో ఆనందదాయకం మరియు సంతుష్టి కరమనియు ఆమెకు అనిపించింది. ఆ వారమంతా హాలులో కూర్చోవడం తప్ప ఆమె ఇంకేమీ చేయలేదు. ఏకాగ్రచిత్తంతో శ్రీరమణులను వెంటాడుతూనే ఉంది. ఆమెలో ఏదో తెలియని ఆనందము చోటు చేసుకుంది.

ఆశ్రమ వాతావరణంలో మరియు సద్గురు శ్రీరమణులతో ఎంతో అనుబంధాన్ని పెంచుకున్నారు శాంతా రంగాచారి గారు. ఆశ్రమంలో ఉన్నన్ని రోజులు ప్రపంచంతో సంబంధం లేకుండా మాటలకందని ఒక స్థితి అంటే అన్ని మైమరిచిన స్థితిలో; మనసు మాయమైపోయిన స్థితిలో ఆమె రమించారు. సమస్త జీవుల పట్ల

ఒక సమదృష్టి మరియు ప్రేమ ఆమెలో అంకురించాయి. ఇలా ఆమెలో ఉదయించిన ఈ ప్రేమ భౌతికతలాన్ని దాటి ఒక కొత్త చైతన్యపు ఎఱుకను కలిగించింది. ఆ ఎఱుకను మాటలలో వర్ణించాలంటే దానిని మనం వర్ణనాతీతమైన ఆనందము అని చెప్ప వచ్చును. అట్టి ఆనందము ఒక స్థలానికి మరియు కాలానికే పరిమిత మైనది కాదు. ఈ ఆనందం అంతటా వ్యాపించి ఉందని ఆమె గ్రహించారు. శ్రీరమణుల దర్శనం యొక్క ప్రభావం ఈ విధంగా ఉంటుందని ఆమె తెలుసుకున్నారు.

చిన్నతనంలో శ్రీరమణుల సందర్శనం తర్వాత శాంతా రంగాచారి గారిలో ఎంతో పరివర్తనం కలిగింది. తిరిగి స్కూల్‌కి వెళ్లారు, కళాశాలకు వెళ్లారు, వివాహం చేసుకున్నారు, సంతానాన్ని కూడా కనిపెంచారు. ఒక పాత్రికేయురాలిగా వృత్తిని చేపట్టారు. ఆమెకు గృహస్థాశ్రమమే ముఖ్యమైన వ్యాపకం అయినప్పటికీ, శ్రీరమణాశ్రమానికి వెళ్ళటం వల్ల ఆమె ఆధ్యాత్మికంగా ఎంతో పొందారు. అలసిపోయినా నిరాశ చెంది ఏమీ తోచని అయోమయ స్థితిలో ఉన్నా, శ్రీరమణాశ్రమానికి వెళ్ళాలనే కోరిక ఆమెకు కలిగేది. అన్నిటినీ అంటే ఇంటిని, స్నేహితులని, పుస్తకాలని, తప్పిదాలను, భయాలన్నీ.. వీటన్నింటినీ విడిచి వెళ్లిపోవాలని అనిపించినప్పుడల్లా శాంతా రంగాచారి గారి మనస్సు శ్రీరమణాశ్రమం వైపు పరుగుతీసేది. అరుణాచలానికి ప్రయాణమై శ్రీ రమణాశ్రమానికి వెళ్లి హాలులోకి ప్రవేశించగానే 'పుట్టింటికి వచ్చాను' అనే భావన ఆమెకు కలిగేది. పన్నెండేళ్ల పసి ప్రాయంలో శాంతా రంగాచారి గారికి గురువు తారసపడటం నిజంగా ఆమె మహద్భాగ్యం!

*మూలం: శ్రీరమణులతో ముఖాముఖీ & ఇంటర్‌నెట్*

## Freedom from giving Advice

Talk 11

Dr. K.Subrahmanaian

We all want to be free. There is hardly anyone who doesn't want to be free. The main reason why we are unhappy is because we are not allowed to be what we want to be. Each one wants to be free from interference from other people - not just from people outside the family, but also from people within the family. Nobody wants to be in the control of another. The children want to be free, the wife wants to be free, and you want to be free. When you want to be free, you take certain steps, but you don't give the same freedom to other people. You want to impose your views on them. Right or wrong, you tell your children and wife to behave in a particular way. A time comes when you realize that they do not accept what you are saying. They might not quarrel with you, but they just won't listen to you - they don't behave the way you want them to. At that time, you feel deeply distressed because they are not following the good advice you're giving them. Because of your attachment to them, you want them to follow your advice. When they don't, you feel very upset. When an outsider doesn't follow your advice, you don't get upset. You are able to look at it with a certain measure of detachment. You give advice, and that is the end of it. But when it comes to your own family, you're not able to look at it with any detachment.

You would like your children and wife to behave in a particular fashion because you feel that it's the correct thing to do. You refuse to give them the same freedom that you would like to have for yourself. When somebody comes and tells you what you're doing is wrong, you say that it's not true, and you try to justify what you're doing. You don't want any kind of interference from other people; so, you say,"What I am doing is right." This is exactly what the wife says, the children say. You want your son to do engineering and he says, "No." So, there is a lot of tension at home, as you go on telling him why it is important. Finally, what happens in most cases is that he does what he wants to. But as the head of the family, you feel, "Why is it that they are not listening to me, when what I am saying is right?"

You want your family to be happy in the way that you want them to be happy, not in the way they want to be happy. Children, these days, like rock music, western music, etc. But you may not, and so, you say, "Don't play that music, it is rotten music." They have been brought up in a different atmosphere, so they like it. When you talk about Thyagaraja, the children don't like it. In fact, they may not even have heard about the saint. If you haven't talked about Thyagaraja and his music with them, you cannot expect them to know about him. The influence must come from you - the parent. Sometimes, even if you talk about Carnatic music with the children, if the *prarabdha* is such that they have to undergo a different kind of experience, it will happen - they will listen to only rock

